క్లుప్తంగా

వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్

కాచిగూడ: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ నారాయణగూడ బ్రాంచి ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 9 వరకు 23వ వార్షిక వైఎంసీఏ కార్గిల్ విక్టరీ స్పోర్ట్స్ ఫెస్టివల్ – 2023 ను నిర్వహిస్తున్నట్లు వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ప్రిస్‌లీ గైస్ తెలిపారు. శనివారం నారాయణగూడలోని వైఎంసీఏ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. హైస్కూల్ స్థాయి విద్యార్థినీవిద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చన్నారు. లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, కరాటే, చెస్, కిక్ బాక్సింగ్, క్రికెట్, త్రోబాల్, మార్చ్‌పాస్ట్ పోటీలు ఉంటాయి. ఆసక్తిగల విద్యార్థులు 6వ తేదీలోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సెల్ 77996 65544, 93910 25959.

ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పదవీవిరమణ



ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ముషీరాబాద్: హైదరాబాద్ జిల్లాలో జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ)లో 32 ఏళ్ల పాటు డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా విశిష్ట సేవలు అందించిన టీఎం ప్రసాద్ శనివారం పదవీ విరమణ చేశారు. ముషీరాబాద్ కార్యాలయంలో ఆయనకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఎస్‌బీఎం హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాజీవ్‌విశ్వాస్, ఎంవీ.రమణ, బ్రాంచ్ మేనేజర్ రాముచౌహాన్, మెటిల్డా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ను పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

గంగపుత్ర సంఘం భవన ప్రారంభం



కార్యాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: రాష్ట్రంలో అన్ని కులాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతను అందిస్తోందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం అంబర్‌పేట న్యూ అంబేడ్కర్‌నగర్‌లో గంబీర్‌రావుపేట గంగపుత్ర సంఘం శాఖ సామాజిక భవనాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. అన్ని కులవృత్తుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, సంఘం నాయకులు మంగలిపల్లి యాదయ్య, గంగాధర్ తదితరులున్నారు.

గణేష్ ఉత్సవాలకు తోడ్పాటును అందించాలి



డీసీపీని ఆహ్వానిస్తున్న భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు

అంబర్‌పేట: గణేష్ ఉత్సవాలు ఘనంగా జరిగేలా తోడ్పాటును అందించాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గ కన్వీనర్ జి.ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈస్ట్ జోన్ డీసీపీ సునిల్‌దత్‌ను కోరారు. శనివారం అంబర్‌పేటలోని ఈస్ట్‌జోన్ కార్యాలయంలో ఆయనను కలిసి ఈ నెల 4న గణేష్ మండప నిర్వాహకులతో కలిసి హాజరు కావాలని కోరారు. ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే గణేష్ వేడుకలకు సన్నాహక సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని డీసీపీకి వివరించారు. శ్రీరామనవమి ఉత్సవ సమితి అంబర్‌పేట కన్వీనర్ వెంకట్‌రెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సెంట్రల్ జోన్ కన్వీనర్ బుచ్చిరెడ్డి, ప్రతినిధులు నర్సింగ్‌రావుయాదవ్, చుక్క జగన్, ఈశ్వర్, రమేష్ తదితరులున్నారు.

స్టీల్ బ్రిడ్జి కింద డ్రైనేజీ ప్రవాహం..

ముషీరాబాద్: రూ. 450 కోట్లతో ఇందిరా పార్కు నుంచి వీఎస్టీ వరకు నిర్మించిన స్టీల్ బ్రిడ్జి ప్రారంభమై 15 రోజులు కాకముందే బ్రిడ్జి కింద రోడ్డు నిర్మాణ పనులను అధికారులు తూతూ మంత్రంగా చేతులు దులుపుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నారు. పాత బస్‌భవన్ సమీపంలో రోడ్డు మీద డ్రైనేజీ నిర్మించకుండా తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. శనివారం ఉదయం నుంచి డ్రైనేజీ పొంగుతూ.. మోకాళ్లలోతూ నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి డ్రైనేజీ పనులకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నెరవేరిన పేదల సొంతింటి కల

- కల నెరవేర్చిన ఘనత కేసీఆర్‌దే
- విడతలవారీగా అర్హులకు కేటాయిస్తాం
- స్పష్టం చేసిన ఎమ్మెల్యే ముఠాగోపాల్
- లబ్ధిదారులను స్వయంగా తీసుకెళ్లిన ఎమ్మెల్యే కాలేరు



అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో లబ్ధిదారులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ముషీరాబాద్: నియోజకవర్గ పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ఉన్న నిరుపేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ తన హామీని నెరవేర్చారన్నారు. నియోజకవర్గంలో మొదటి విడతగా డబుల్‌బెడ్రూం ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్నవారికి 500 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయని, రానివారు నిరాశ పడొద్దని మరో మూడు నాలుగు విడతలుగా డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు జరుగుతుందన్నారు. లబ్ధిదారులను శనివారం ఇందిరాపార్కు ఎన్టీఆర్ స్టేడియం నుంచి దాదాపు 23 ఆర్టీసీ బస్సులలో లబ్ధిదారులను తీసుకెళ్లి వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు పొజిషన్ సర్టిఫికెట్లు పంపిణీ చేసి ఇంటి తాళాలను అందజేశారు. ఆర్టీసి బస్సులలో వెళుతున్న డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులతో ఎమ్మెల్యే ముఠాగోపాల్ కొద్దిసేపు వారితో ముచ్చటించారు. అనంతరం మేడ్చల్ జిల్లా అహ్మద్‌గూడలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను ఎమ్మెల్యే ముఠాగోపాల్, మంత్రి మల్లారెడ్డి, సర్కిల్ –15 డీఎంసీ తిప్పర్తి యాదయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ముఠా జైసింహాతో కలిసి ప్రారంభించి అందజేశారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. మొదటి విడతగా లక్కీడ్రా ద్వారా నిర్వహించామన్నారు. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, బీఆర్ఎస్ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్యామ్‌యాదవ్, సాయికృష్ణ, వై.శ్రీనివాస్‌రావు, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్‌కుమార్, నర్సింగ్‌ప్రసాద్, మాధవ్, చిట్టి, ప్రభాకర్, రమేష్, దీన్‌దయాల్‌రెడ్డి, రమేష్, రాజశేఖర్‌గౌడ్, రవియాదవ్, జమాలుద్దీన్, రాంచందర్ తదితరులున్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

సమాచారం లేక..

డబుల్ బెడ్రూం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు తమకు ఫోన్లు రాకున్నా వచ్చి ఇబ్బందులు పడ్డారు. ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు సమాచార కేంద్రం వద్ద పడిగాపులు కాశారు. కొంతమంది ఫోన్లు పనిచేయక, కొంత మంది ఫోన్లు స్విచ్‌ఆఫ్ ఉండటంతో తమకు కూడా ఇళ్లు వచ్చాయో మోనని ఆధార్‌కార్డు, గంతలో వారు ఈ సేవాలో డబుల్ బెడ్రూం ఇళ్లకోసం దరఖాస్తు చేసుకున్న స్లిప్పులతో వచ్చి ఇబ్బందులు పడ్డారు. లక్కీ డ్రా తీసిన వారికి శుక్రవారం ఫోన్లు వచ్చాయని వారికి మాత్రమే ఇళ్లు కేటాయింపు జరిగిందని మిగతావారికి మరో మూడు నాలుగు దఫాలలో ఇళ్లు కేటాయింపు ఉంటుందని అధికారులు వారిని వెనక్కి పంపించారు.



మంత్రి మల్లారెడ్డితో కలిసి డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభిస్తున్న దృశ్యం

సొంతింటి ఆశలు సాకారం..

అంబర్‌పేట: సామాన్యుల ఇంటి కల నెలవేరింది. సొంతింటిపై పెట్టుకున్న ఆశలు సాకారమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలకు డబుల్ బెడ్రూం పథకంతో భాగంగా దరఖాస్తు చేసుకున్న పేదలకు లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి శనివారం అందజేశారు. అంబర్‌పేట నియోజకవర్గంలో ఎంపికైన 500 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో పంపిణీ జరిగింది.

◆ అంబర్‌పేట నియోజకవర్గంలో ఎంపికైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే స్వయంగా ఫోన్లు చేసి అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌కు ఆహ్వానించారు. అందరికీ ఉదయం అల్పాహారం అందించి ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో దగ్గరుండీ తీసుకెళ్లారు.

పేదలకు జీవిత కల..



పేదలకు సొంతింటి కల అనేది ఎంతో విలువైనది. సీఎం కేసీఆర్ అధికారంలోకి రాగానే పేదలకు గౌరవ ప్రదమైన జీవనం సాగించేందుకు డబుల్‌బెడ్రూం పథకం ప్రవేశపెట్టి లక్షల ఇళ్లు నిర్మించి పంపిణీ చేస్తున్నారు. పేదలకు అభ్యున్నతికి ఒక శాసన సభ్యుడిగా భాగస్వామ్యంగా కావడం గర్వంగా ఉంది. మరో 5 విడతల్లో మరింత మందిని ఎంపిక చేసి అందజేస్తాం.
– ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ఎంతో ఆనందంగా ఉంది..



పైసా ఖర్చులేకుండా కొత్త డబుల్‌బెడ్రూం ఇళ్లు రావడంతో పట్టలేనంత ఆనందంగా ఉంది. 8 ఏళ్ల క్రితం మీ సేవలో దరఖాసకతు చేసుకున్నాను. అధికారులు విచారణ జరిపిన ప్రతిసారి అర్హత పత్రాలు చూపించాను. డబుల్ బెడ్రూం మంజూరైందని ఫోన్ రావడంతో మా కుటుంబం అంతా సంతోషంగా ఉంది.
– సవిత, ప్రేమ్‌నగర్

ఊహించలేదు..



డబుల్‌బెడ్రూం ఇంటికోసం దరఖాస్తు చేసుకుని ఎదురు చూశాను. ప్రభుత్వసాయం, దేవుడి ఆశీర్వాదంతో ఇళ్లు వచ్చింది. సొంతింటి కోసం ఎంతో తపించాం. వేల మందిలో తమకు ఇళ్లు రావడం ఊహించలేదు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు. – భవానీ, బాగ్‌అంబర్‌పేట

చాలా ఆనందంగా ఉంది..



డబుల్ బెడ్రూం ఇళ్లు రావడంతో చాలా సంతోషంగా ఉంది. ఇన్ని రోజులు అద్దె చెల్లించలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ప్రభుత్వం ఎలాంటి ఖర్చు లేకుండా డబుల్‌బెడ్రూం ఇళ్లు కేటాయించడం సంతోషంగా ఉంది. – రేఖ, లబ్ధిదారు

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం..



డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించడం చాలా సంతోషంగా ఉంది. నగరంలో సొంత ఇళ్లు అంటే మాటల్లో చెప్పలేనంత ఆనందంగా ఉంది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.
– అభిషేక్, లబ్ధిదారు

ఎమ్మెల్యేకు సన్మానం

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ దయార, జెమిస్తాన్‌పూర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పరకాల రజనికాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యేకు గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా పింఛన్‌లతో పాటు రేషన్ కార్డులు, సాగు, తాగునీటి కోసం ప్రాజెక్టులను నిర్మించామన్నారు. నియోజకవర్గంలో గత 30 ఏళ్లుగా రోడ్లు అధ్వానంగా ఉండేవని, తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడేవారన్నారు. ప్రస్తుతం ఎటుచూసినా కొత్త వీడీసీసీ రోడ్లు, నూతన సివరేజీ, తాగునీటి పైపులైన్లు వేశామన్నారు. బీఆర్ఎస్ నేత ముఠా జైసింహ, రావులపాటి మోజెస్, వై.శ్రీనివాస్, నర్సింగ్‌ప్రసాద్, శ్రీను, గురుదీప్, పరకాల మనోజ్‌గౌడ్, సుదర్శన్, మల్లేష్‌గౌడ్, సూర్యనారాయణ, దయానంద్, నరేందర్, కర్ణ ప్రకాష్, మహేష్, మురళి, ఇంద్రసేనారెడ్డి తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

రమణీయం.. రాఘవేంద్రస్వామి రథోత్సవం



బర్కత్‌పుర పురవీధుల్లో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కాచిగూడ: గత మూడు రోజులుగా జరుగుతున్న రాఘవేంద్రస్వామి 352వ ఆరాధనోత్సవాలు మహారథోత్సవంతో ముగిశాయి. చివరి రోజైన శనివారం బర్కత్‌పురలోని మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్తరారాధన విశేష పూజలను భక్తుల జయజయ ధ్వానాల మధ్య నిర్వహించారు. బర్కత్‌పుర పురవీధుల్లో మహారథోత్సవం భజనలు, భక్తి గీతాలాపనలు, మహిళలు, యువతులు, పిల్లల నృత్యాలతో కనుల పండువగా జరిగింది. పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. గరికపాటి నరసింహారావు, దిడ్డి రాంబాబు, మఠం మేనేజర్ కె.రాఘవేంద్రరావు తదితరులున్నారు.



కాచిగూడలో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కాలేరు

బృందావన సమితిలో..

◆ కాచిగూడ, లింగంపల్లి రాఘవేంద్ర బృందావన సమితిలో ఆరాధనోత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొని రాఘవేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అష్టోత్తర, పంచామృత, మధు అభిషేకం, సత్యనారాయణ పూజ, అలంకార, హస్తోదక పూజలు జరిగాయి. శ్రీహరి కథామృత పారాయణం, ఫల మంత్రాక్షింతలు జరిగాయి. బృందావన సమితి మేనేజర్ కె.నర్సింహాచార్య, కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్, బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి, దిడ్డి రాంబాబు తదితరులున్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కాచిగూడ: గణేష్ నవరాత్రి ఉత్సవాల స్వాగత వేడుకల పోస్టర్‌ను భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్‌రావు కాచిగూడలోని భజరంగ్ సేన కార్యాలయంలో భక్తులు, కార్యకర్తల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం మాట్లాడుతూ.. ఈనెల 9న బేగంబజార్, గోషామహల్ చందన్‌వాడి వద్ద వినాయక స్వాగత వేడుకలను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. భజరంగ్ సేన యూత్ ప్రెసిడెంట్ ఎం.వినీత్‌యాదవ్ టీమ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానకార్యదర్శి సూర్య శుక్లా, మనోజ్, ప్రవీణ్‌యాదవ్, అజయ్ నాయుడు, సతీష్ రాజు, జగదీష్‌గౌడ్, నరేష్, సన్నీ, చింటు, అశ్విన్, బబ్బీ, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఆవిష్కరిస్తున్న భజరంగ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.ఆర్.లక్ష్మణ్‌రావు

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి



ట్రాఫిక్ ఆంక్షలను వివరిస్తున్న నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ సుధీర్‌బాబు

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వీఎస్టీ జంక్షన్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ అశోక్‌నగర్ చౌరస్తాలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు స్టీల్ బ్రిడ్జ్‌ను నిర్మించడంతో వాహనాల రద్దీ పెరిగిందని నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్ జి. సుధీర్‌బాబు అన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ ఆలయం చౌరస్తా తెలుగు తల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జ్, సచివాలయం అసెంబ్లీ వైపు మార్గాల్లో ట్రాఫిక్ అధికంగా ఉందని, ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. కట్ట మైసమ్మ ఆలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం లోయర్‌ట్యాంక్‌బండ్, బండ మైసమ్మ నగర్, రామకృష్ణ మఠం మార్గాల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నామన్నారు. ట్రాఫిక్ అదనపు డీసీపీ షాకీర్ హుస్సేన్ సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ ఎన్‌బీ రత్నం, చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం అడ్మిన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులున్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



నల్లకుంట: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. సీపీఎం అంబర్‌పేట జోన్ కమిటీ ఆధ్వర్యంలో నల్లకుంట తిలక్‌నగర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీనికి హాజరైన సీపీఎం హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు మహేందర్ మాట్లాడుతూ.. నేడు పెట్రోల్, డీజిల్ ధరలు, అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలను పెంచుతూ.. పేద ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నారని ఆరోపించారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ.. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా విభజించి కార్మికుల పొట్ట కొడుతున్నారని విమర్శించారు. సీపీఎం అంబర్‌పేట జోన్ కమిటీ సభ్యులు జి.రాములు, సుబ్బారావు, ఎండీ. అఖిల్, షబానా పార్టీ నాయకులు వరలక్ష్మి, రఘునాయక్, భాస్కర్, శ్రీనివాస్, మల్లిఖార్జున్, జనార్దన్ తదితరులున్నారు.

అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



హిమాయత్‌నగర్: అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మిగౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి పలు వార్డులకు సంబంధించిన బీజేపీ కార్యకర్తలు, పార్టీ శ్రేణులతో ఆమె రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామన్‌గౌడ్‌తో కలసి సమావేశమయ్యారు.

కార్మిక సంక్షేమమే ధ్యేయంగా..

నూతన వేతన ఒప్పందంతో సంబరాలు



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న కార్మికులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా తాను పని చేస్తున్నాని వీఎస్టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం వీఎస్టీలో జరిగిన నూతన వేతన ఒప్పందాన్ని పురస్కరించుకుని వీఎస్టీ ఫంక్షన్ హాల్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వీఎస్టీ కంపెనీ నుంచి వీఎస్టీ ఫంక్షన్‌హాల్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం శ్రీనివాస్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నూతన వేతన ఒప్పందం ప్రకారం రూ.15,115 ఉన్న వేతనం రూ.20,270కు పెరిగిందన్నారు. కార్మికులకు రూ. 8 లక్షలు ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలకు పెంచామన్నారు. సర్వీస్‌లో ఉండి మృతిచెందిన కార్మికులకు నష్టపరిహారంగా రూ.13 లక్షల నుంచి రూ.16 లక్షలకు పెంచామన్నారు. అన్ని కంపెనీలతో పాటుగా వీఎస్టీ కంపెనీ కూడా తూప్రాన్‌కు వెళ్తుందని కార్మికులకు నష్టం జరగకుండా రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. సీఎం కేసీఆర్ సలహా మేరకే తనని రాజకీయ నాయకుడిగా నాయిని నర్సింహ్మారెడ్డి పరిచయం చేశారన్నారు. వీఎస్టీ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఐ.ప్రభాకర్, కోశాధికారి నరేందర్‌గౌడ్, థామ్సన్, అసిస్టెంట్ సెక్రటరీ రవీందర్‌యాదవ్, మధుసూదన్, రణధీర్‌రెడ్డి, రాములు, మల్లేషం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పారదర్శకతలేని లబ్ధిదారుల ఎంపిక'

ముషీరాబాద్: గ్రేటర్ పరిధిలో డబుల్‌బెడ్రూం లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వం తాను జారీచేసిన ఆదేశాలనే పాటించడంలేదని సీపీఎం గ్రేటర్ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 2017 నవంబర్ 26న విడుదల చేసిన జీవో 12 ద్వారా ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు మార్గదర్శకాలు జారీ చేసిందని దీని ప్రకారం వార్డుసభ ద్వారా దరఖాస్తులు స్వీకరించి చివరగా వార్డు సభలోనే లబ్ధిదారులను ఫైనలైజ్ చేయాలన్నారు. దీనిపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన ప్రభుత్వం వాటిని పక్కనపెట్టి వార్డు సభ జరపకుండానే లబ్ధిదారుల ఎంపిక చేసిందన్నారు. ఎస్సీలకు 17 శాతం, ఎస్టీలకు 6 శాతం, మైనార్టీలకు 12 శాతం, రిజర్వేషన్లు పాటించాలని జీవో నెంబర్ 10 ద్వారా స్పష్టం చేసినప్పటికీ వీటిని కూడా పాటించలేదన్నారు. పారదర్శకత, నిబంధనలు పాటించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా లబ్ధిదారులను ఎంపిక చేసిందని ఆరోపించారు. కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల్లో పెట్టుకున్న లక్షలాది దరఖాస్తులను పక్కనపెట్టి పేదలను మోసం చేశారన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పెట్టుకున్న దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకోలేదని ఆన్‌లైన్‌లో వచ్చిన కొద్దిపాటి దరఖాస్తులను సర్వే చేయడం మినహా మిగతా లక్షల దరఖాస్తులను చెత్తబుట్టలో తోసేయడం అత్యంత దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో ఆర్య జననీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. యువజన నాయకులు ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, గాంధీనగర్ అధ్యక్షులు మూడారపు రాకేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పోతుల శ్రీకాంత్, గున్నా సత్యనారాయణ, గుండు జగదీష్ బాబు, ఎం.దేవయ్య, యాదగిరి పాల్గొన్నారు.

మహానేతకు ఘన నివాళి

అంబర్‌పేట్/ముషీరాబాద్ జోన్ పరిధిలో దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 14వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం ఆయన చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నదానం, పేదలకు పండ్ల పంపిణీ, సేవా కార్యక్రమాలు నిర్వహించి, ఆయన చేసిన సేవలను కొనియాడారు.
– అంబర్‌పేట్/ ముషీరాబాద్ బృందం



రాంనగర్ గుండు వద్ద నివాళులర్పిస్తున్న అంజన్‌కుమార్‌యాదవ్, అనిల్‌కుమార్‌యాదవ్



ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నివాళులర్పిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్, కోదండరెడ్డి



వైఎస్ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగేష్‌ముదిరాజ్



ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఆకుల ప్రవీణ్ ఆధ్వర్యంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383